క్లుప్తంగా

15న పాకల బీచ్‌లో యోగా సామూహిక ప్రదర్శన

సింగరాయకొండ: మండలంలోని పాకల బీచ్‌లో ఈనెల 15వ తేదీ ఉదయం 7 గంటలకు యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగా సామూహిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు తహసీల్దార్ టీ రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనలో సుమారు 1,500 మంది పాల్గొంటారని ముఖ్యఅతిథిగా మంత్రి స్వామి పాల్గొంటారని వివరించారు.

మైనర్లు వాహనాలు నడపరాదు



పొన్నలూరులో మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై అనూక్

పొన్నలూరు: మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే చర్యలు తప్పవని ఎస్సై అనూక్ హెచ్చరించారు. పొన్నలూరు సెంటర్‌లో శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టి అనుమతి పత్రాలతో పాటు, హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా బైక్‌లు నడుపుతున్న మైనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ మైనర్లు బైకులు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. చిన్న వయస్సులో వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడవద్దని సూచించారు. అలాగే వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే కేసులు తప్పవన్నారు.

హెచ్‌ఎంపాడు ఏఓగా రవికుమార్



రవికుమార్

హనుమంతునిపాడు: మండల కేంద్రం హనుమంతునిపాడు ఏఓగా వి.రవికుమార్ శుక్రవారం విధుల్లో చేరారు. ఇక్కడ పని చేస్తున్న కేవీ రమణ ఒంగోలుకు బదిలీపై వెళ్లారు. రవికుమార్ నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులు తమ రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులు వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

మర్రిపూడి తహసీల్దార్‌గా జనార్దన్



నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్న జనార్దన్

మర్రిపూడి: మర్రిపూడి తహసీల్దార్‌గా బీ జనార్దన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. జరుగుమల్లి మండలంలో తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై మర్రిపూడి మండలం వచ్చినట్లు తెలిపారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ జ్వాల నరసింహారావు ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ జనార్దన్‌ను రెవెన్యూ సిబ్బంది శాలువాలతో సత్కరించారు.

నేడు అంకమ్మ తల్లి తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో అంకమ్మ తల్లి

పీసీపల్లి: మండలంలోని పెద ఇర్లపాడులో వెలసిన అంకమ్మ తల్లి తిరునాళ్ల శనివారం నిర్వహించనున్నారు. కోరిన కోర్కెలు తీర్చే గ్రామ దేవత అంకమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించేందుకు దూరప్రాంతాల్లో ఉన్న బంధువులు ఇప్పటికే గ్రామానికి చేరుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలు అమ్మవారి గ్రామోత్సవంలో శుక్రవారం రాత్రి పాల్గొన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆదివారం పొంగళ్లతో తిరునాళ్ల ముగుస్తుంది.

డిప్యూటీ ఎంపీడీఓగా సుందర రామయ్య



సుందర రామయ్య, డిప్యూటీ ఎంపీడీఓ

పామూరు: డిప్యూటీ ఎంపీడీఓగా కె.సుందర రామయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తాళ్లూరు మండల డిప్యూటీ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై పామూరు వచ్చారు. ఇన్నాళ్లు పామూరు పీఎస్ జి.అరవిందారెడ్డి డిప్యూటీ ఎంపీడీఓగా విధులు నిర్వహించారు.

ప్రమాదంలో ప్రయాణం..!



నెల్లూరు వైపు వెళ్లే రోడ్డుపై నిలిపి సపోట బస్తాలు వేస్తున్న ఆర్టీసీ (ఫైల్)



జంక్షన్‌లో బస్సులకు ప్రమాద ఘంటికలు (ఫైల్)

- రోడ్డు పైనే నిలిపి కార్గో సేవలు
- ప్రమాదాలకు నిలయంగా ఉలవపాడు ఉత్తర బైపాస్ జంక్షన్
- పట్టించుకోని పోలీసు, హైవే అధికారులు

ఉలవపాడు: అసలే జాతీయ రహదారి. నిత్యం వేలాదిగా వాహనాలు 24 గంటలూ రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రయితే ఇంకా ప్రమాదకరంగా ఉంటుంది. జాతీయ రహదారిపై రోడ్డు మీద వాహనం నిలపడం అంటేనే ప్రమాదంతో కూడుకున్న పని. అలాంటిది పోలీసులు గుర్తించిన ప్రమాదాలు జరిగే జోన్‌లో వాహనాలు నిలిపి కార్గో, సపోట, ఇతర సరుకు బస్తాలు వేసుకోవడం ఎంత భయంకరంగా ఉంటుందో ఊహించలేము. కానీ హైవేలో ఉలవపాడు ఉత్తర బైపాస్ జంక్షన్‌లో ప్రస్తుతం అదే జరుగుతోంది. నడిరోడ్డుపై వాహనాలు నిలిపి సపోట బస్తాలు, మామిడి బాక్స్‌లు ఏపీఎస్ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులు, టీఎస్ ఆర్టీసీ బస్సులు వేసుకుంటున్నారు. ఎప్పుడు ఏ వాహనం వెనుక నుంచి ఢీ కొడుతుందో అనే భయంతో ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ లోపల కూర్చుంటున్నారు. మండలంలో తరచుగా ప్రమాదాలు జరిగే ఈ ప్రాంతంలో వాహనాలు నిలుపుదల చేయడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం అధికంగా ఉంది. అయినా కార్గో సేవల కోసం బస్సులను ఇక్కడ 15 నిమిషాల నుంచి 30 నిమిషాల వరకు నిలుపుతున్నారు. ఇలా ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.

ప్రమాద జంక్షన్‌లో నిలుపుదల..

హైవేలో ఉలవపాడు ఉత్తర బైపాస్ ప్రమాదకర జంక్షన్. ఈ ప్రదేశంలో ఎన్నో ప్రమాదాలు జరిగాయి. ఇటీవల ఏప్రిల్ 29న ఓ ట్రావెల్స్ బస్సును లారీ ఢీకొన్న ఘటన జరిగింది. అంతే కాకుండా కారు ప్రమాదాలు, లారీలు ఢీ కొన్న ఘటనలు ఎన్నో జరిగాయి. ఇలాంటి జంక్షన్‌లో వాహనాలు నిలుపుదల చేయడం వలన ప్రమాదాల ముప్పు ఉంది. ముప్పు ఉందని తెలిసి కూడా బస్సుల డ్రైవర్లు ఇక్కడ బస్సులు ఆపుతున్నారు. ప్రయాణికులు ప్రశ్నిస్తే పది నిమిషాలు వెంటనే వెళ్లిపోతాం.. గొడవలు ఎందుకు అంటూ ప్రయాణికులకు నచ్చచెప్తున్నారు. కానీ వారి ప్రాణాలు పణంగా పెట్టి ఇక్కడ లగేజీలు, కార్గో సేవలు నిర్వహిస్తున్నారు.

తప్పెవరిది..!

ఇది ప్రమాద జోన్ అని తెలిసి కూడా ఇక్కడ వాహనాలు నిలుపుతున్న ఆర్టీసీ, ప్రైవేటు డ్రైవర్లది తప్పా.. లేక ఇక్కడ వాహనాలు నిలిపి కార్గో లగేజీలు వేసుకోవాలని చెప్పిన ఆర్టీసీ అధికారులది తప్పా. ఇక్కడ వాహనాలు నిలపొద్దని గతంలో బారికేడ్లు, డ్రమ్ములు ఏర్పాటు చేసిన పోలీసులు ఇక్కడ వాహనాలు నిలుపుతున్నా కనీసం పట్టించుకోకపోవడం లేదు. హైవే పై ప్రమాదాల నివారణ కోసం హైవే సిబ్బంది, పోలీసు రోడ్ సేఫ్టీ సిబ్బందికి ప్రత్యేక వాహనాలు కేటాయించి హైవేపై తిరుగుతూ కూడా రోడ్డుపై వాహనాలు నిలిపి ఉన్నా మెల్లగా వెళ్లిపోతున్నారే కాని పట్టించుకోవడం లేదు. ఇలా ఎవరది తప్పో ఆయా శాఖలు నిర్ణయించుకోవాలి. గతంలో ఎన్నో ప్రమాదాలు జరిగిన ప్రమాద జోన్‌లో మరో ప్రమాదం జరగకుండా చూడాల్సిన భాద్యత ఎవరిది అనేది హైవే, పోలీసు సిబ్బంది తెలుసుకోవాల్సిన అవసరం వచ్చింది. డేంజర్ జోన్ అందులోనూ రోడ్డుపై వాహనం నిలిపి 15 నిమిషాలుపైన ఉంచినా పట్టించుకోవడం లేదు.

పోలీసు, హైవే అధికారుల నిర్లక్ష్యమేనా?

పోలీసు శాఖ, హైవే, ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. లారీలు ప్రమాదానికి గురయితే ప్రాణ నష్టం చాలా తక్కువగా ఉంటుంది. కానీ ఒక బస్సు ప్రమాదానికి గురయితే నష్టం అంచనా వేయలేం. ఇలాంటి పరిస్థితుల్లో ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన పోలీసు, హైవే అధికారులు నిర్లక్ష్యం కనిపిస్తోంది. హైవేపై వాహనం నిలపాలంటే కచ్చితంగా పార్కింగ్ ఏరియాలోనే ఉంచాలి తప్పా రోడ్డుపై కానీ మార్జిన్‌లో కాని నిలపకూడదు. వేగంగా వచ్చే వెనుక వాహనాలు ఢీ కొట్టే అవకాశం అధికంగా ఉంటుంది. అందుకే హైవే అధికారులు తమ వాహనంలో నిరంతరం గస్తీ తిరుగుతుంటారు. రోడ్ల పై వాహనాలు నిలపకుండా చేస్తుంటారు. కానీ ఇక్కడ మాత్రం భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. 10 నిమిషాల పైనే రోడ్డు మీద బస్సులు నిలిపి ఉన్నా వీరెవరూ పట్టించుకున్న దాఖలాలే లేవు. ప్రయాణికుల భద్రతే తమకు ముఖ్యమని చెప్పే ఆర్టీసీ అధికారులు సైతం నడిరోడ్డు పై వాహనం నిలిపి ఉంటే కనీసం పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రమాదాలు జరగకుండా పార్కింగ్ ఉన్న ప్రాంతంలో వాహనాలు నిలుపుదల చేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



ఏప్రిల్ 29న అక్కడే ట్రావెల్స్ బస్సును ఢీకొట్టిన లారీ (ఫైల్)



ఒంగోలు వెళ్లే వైపు ప్రమాదకరంగా బస్సు నిలిపి వేస్తున్న బస్తాలు (ఫైల్)

చినుకు పడితే చిత్తడే



కొండపి ఫ్లయిఓవర్ నుంచి టంగుటూరు సెంటర్ వరకు అధ్వానపు రోడ్డు

- కొండపి ఫ్లయి ఓవర్ నుంచి టంగుటూరు సెంటరు వరకు రోడ్డు అధ్వానం
- జాతీయ రహదారి బ్రిడ్జి కింద వర్షపు నీరు
- పట్టించుకోని హైవే అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కొండపి జాతీయ రహదారి కింద వర్షపు నీరు

టంగుటూరు: మండలంలోని కొండపి ఫ్లై ఓవరు నుంచి టంగుటూరు సెంటరు వరకు రోడ్డు, జాతీయ రహదారి బ్రిడ్జి కింద వర్షపు నీటితో చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతోంది. ఈ మార్గంలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు మొత్తం రాళ్లు తేలిపోయి గుంతలమయం కావడంతో వర్షపు నీరు చేరి చిత్తడిగా మారుతోంది. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. బురదకు అదుపుతప్పి కిందపడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. హైవే అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అటు బాటసారులు, వాహనదారులు అవస్థల పాలవుతున్నారు. కొండపి ఫ్లై ఓవరు కింద వర్షం పడినప్పుడల్లా నీరంతా బ్రిడ్జి కిందకు చేరుతుంది. దాదాపు ఆరు ఇంచుల మేర నీరు నిలిచిపోతుంది. ఈ నీరు వెళ్లేందుకు ఎక్కడా అవకాశం లేదు. నీరు ఇంకిపోయేంత వరకు వాహనదారులు, బాటసారులు మడుగులోనే వెళ్లాల్సిందే. ప్రభుత్వ, జాతీయ రహదారి అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని, వర్షపు నీటిని తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ అధికారుల దాడులు



మాట్లాడుతున్న విద్యుత్ అధికారులు

కనిగిరి రూరల్: పట్టణంలో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. 23 మంది అధికారులు, 70 మంది సిబ్బంది 34 బృందాలుగా ఏర్పడి 789 సర్వీసులను తనిఖీ చేశారు. విద్యుత్ చౌర్యం, అధిక లోడు, అనుమతికి మించిన లోడు, ఇలా అనేక కేసుల్లో 52 మందికి మొత్తం రూ. 2.42 లక్షల అపరాధ రుసుం విధించినట్లు అధికారులు తెలిపారు. దాడుల్లో డీఈ ఆర్. ఉమాకాంత్, డీఈఈడబ్ల్యూ కె.వెంకటేశ్వర్లు, ఏ శ్రీనివాసరావు, ఏఈలు కోటేశ్వరావు, పవన్‌కుమార్, కృష్ణారెడ్డి, నవీన్, రసూల్, జిలానీ, మణికంఠ పాల్గొన్నారు.

మాలకొండ హుండీ ఆదాయం లెక్కింపు

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండలో వెలసి ఉన్న మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థాన హుండీ లెక్కించారు. 11 వారాలకు సంబంధించిన హుండి లెక్కింపును శుక్రవారం కొండ మీద ఉన్న కల్యాణ మండపంలో నిర్వహించామని ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఎస్ చంద్రశేఖర్ తెలిపారు. హుండీ లెక్కింపులో భాగంగా రూ.1.14 కోట్ల నగదు, అలాగే 308 గ్రాముల బంగారం, 2.415 కేజిల వెండి వచ్చిందని తెలిపారు. ఇతర దేశాల కరెన్సీలో భాగంగా 251 అమెరికన్ డాలర్లు, 80 సింగపూర్ డాలర్లు, 2 మలేషియా రింగెట్స్, 20 ఇంగ్లాండ్ పౌండ్స్, 1000 వియత్నామ్ డాంగ్, 100 సౌతాఫ్రికన్ రాండ్ వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యాక్రమం పర్యవేక్షణ అధికారి సత్యనారయణ పర్యవేక్షణలో జరిగింది.

21 నుంచి సీపీఐ జిల్లా మహాసభలు



కార్యకర్తలతో మాట్లాడుతున్న పెద్ద మస్తాన్

సీఎస్‌పురం (పామూరు): జిల్లాలోని దర్శిలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని మండల కార్యదర్శి ఎస్‌కేవై పెద్దమస్తాన్ అన్నారు. మండలంలోని కోవిలంపాడులో శుక్రవారం సీపీఐ సమితి సమావేశం ఎస్‌కే నాయబ్ రసూల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా మహాసభలను జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరూ విధిగా తరలి రావాలన్నారు. ఆగస్టు 23 నుంచి 25వ తేదీ వరకు రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరుగుతాయని, పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. సీపీఐ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కనిగిరి రూరల్: 33 కేవీ లైన్ విద్యుత్ మరమ్మతుల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో శనివారం కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రూరల్ విద్యుత్ ఏఈ మోహన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మండలంలోని అజీస్‌పురం, పునుగోడు, తాళ్లూరు, గుడిపాడు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ నిలిపివేయనున్నామని, ప్రజలు, వినియోదారులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

నారసింహునికి ఎస్పీ పూజలు



బ్రహ్మోత్సవాల్లో భద్రత ఏర్పాట్లపై సీఐ హజరత్తయ్యకు సూచనలిస్తున్న ఎస్పీ దామోదర్

సింగరాయకొండ: పాతసింగరాయకొండ వరాహలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఎస్పీ ఏఆర్ దామోదర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ పీ కృష్ణవేణి ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలు చేశారు. సాయంత్రం రథోత్సవం సందర్భంగా పోలీసులు తీసుకున్న భద్రతా చర్యలను ఆయన స్వయంగా పర్యవేక్షించి డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సీఐ సీహెచ్ హజరత్తయ్య, ఎస్సై బీ మహేంద్రకు ప్రత్యేక సూచనలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

18 నుంచి బ్రహ్మోత్సవాలు



అచ్చమాంబ పేరంటాలు మూల విగ్రహమూర్తి

పామూరు: మండలంలోని రఘునాథపురం కమ్మవారిపాలెంలోని అచ్చమాంబ దేవస్థానంలో శ్రీ అచ్చమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు ఈ నెల 18వ తేదీ బుధవారం నుంచి 22వ తేదీ ఆదివారం వరకు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ తెలిపింది. 18వ తేదీన నిలుపు, పశుపు కుంకుమ, సారెకావెళ్లు, 19న గణపతిపూజ, పుణ్యాహవచనం, గ్రామోత్సవం, 20న అమ్మవారికి అభిషేకం, గ్రామోత్సవం, 21న కల్యాణోత్సవం, కుంకుమార్చన, పశుపు, కుంకుమ, పెద్ద ఉత్సవము, 22న బండ్లు, పొంగళ్లు, రాష్ట్రస్థాయి ఎడ్లపందాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని దేవస్థాన కమిటీ తెలిపింది.



బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న ఆలయం

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేత



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు సూసన్నకుమార్

కొండపి: మండలంలోని కే.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 10వ తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను ప్రధానోపాధ్యాయుడు వి.సుసన్న కుమార్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా సూసన్న కుమార్ మాట్లాడుతూ ఇటీవల విడుదలైన ఇంటర్మీడియెట్ ఫలితాల్లో, ఈఏపీసెట్ ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, నాణ్యమైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకంలో అవకతవకలు సహించం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

కొండపి: విద్యార్థులకు అందించే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని కొండపి తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వెన్నూరు జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రభుత్వం అందించే సౌకర్యాలతో విద్యార్థులు బాగా చదివి ఉన్నత ర్యాంకులు సాధించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 రామారావు, ఆర్ఐ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయురాలు భారతి, సీఆర్ఎంటీ బ్యూలా రాణి, పాఠశాల సిబ్బంది, మోడల్ స్కూల్ పీఎస్ హెచ్‌ఎం మాల్యాద్రి పాల్గొన్నారు.

ఉపాధి కూలి తక్షణమే చెల్లించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న కూలీలు

హనుమంతునిపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీల బిల్లులు తక్షణమే చెల్లించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం ముక్కువారిపల్లిలో ఉపాధి పని వద్ద కూలీలతో కలిసి బిల్లుల చెల్లింపులు చేయాలని ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు మూడు నెలల నుంచి ఒక్క పైసా కూడా చెల్లించలేదని ఆరోపించారు. పూట గడవక పేద కుటుంబాల వారు అల్లాడిపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బిల్లులు నిర్లక్ష్యం చేయకుండా చెల్లించాలన్నారు. బిల్లులు వెంటనే చెల్లించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని వ్యవసాయ కార్మిక జిల్లా ఉపాధ్యక్షుడితో పాటు మండల కార్మిక సంఘ నాయకులు, ఉపాధి కూలీలు హెచ్చరించారు.

అధికారులు బాధ్యతల స్వీకరణ

వలేటివారిపాలెం: మండలం నూతన వ్యవసాయ అధికారిగా కే శేషారెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ తమ రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఉద్యానవన సహాయకుల చేత ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. ఈ-కేవైసీ పూర్తి చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం అందజేస్తున్న అన్నదాత సుఖీభవ రూ.5000, కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సమ్మాన్ నిధి కింద రూ.2000 కలిపి రూ.7000 నగదు అందుతాయని ఆయన తెలియజేశారు.

పశు వైద్యశాల అసిస్టెంట్ డైరక్టర్‌గా డాక్టర్ చెన్నకేశవులు..

వలేటివారిపాలెం ఏరియా నూతన పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్‌గా డాక్టర్ చెన్నకేశవులు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం వైద్యశాలలో పనిచేశారు. ప్రభుత్వ చేపట్టిన బదిలిలో భాగంగా ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇక్కడ వైద్యాశాలలో పనిచేస్తునన్న డాక్టర్ బ్రహ్మయ్య అద్దంకి పశు వైద్యశాలకు బదిలీపై వెళ్లారు.